సాక్షి
హనుమకొండ

సోమవారం । 26 । ఆగస్టు । 2024

బోనాలు సమర్పించి మొక్కు తీర్చుకుంటున్న భక్తులు



మచిలీబజార్ రోడ్‌లో బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు



హనుమకొండ గాంధీనగర్ పోచమ్మ గుడి వద్ద బారులుదీరిన భక్తులు



పోచమ్మకుంటలోని ఆలయం వద్ద..



దామెర మండల కేంద్రంలో..



పోచమ్మకు బోనం..

గ్రేటర్ వరంగల్ నగరంలో బోనాల సందడి నెలకొంది. శ్రావణ మాసం ముగుస్తుండడంతో ఆదివారం భక్తులు పోచమ్మ దేవాలయాలకు పోటెత్తారు. డప్పుచప్పుళ్లు, పోతరాజుల విన్యాసాల మధ్య మహిళలు బోనాలతో ఆలయాలకు చేరుకున్నారు. భక్తి శ్రద్ధలతో తల్లికి బోనం నైవేద్యంగా సమర్పించారు. చల్లంగ చూడమని వేడుకుంటూ ఒడిబియ్యం పోశారు. మేకలు, కోళ్ల బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పోలీసులు బందోబస్తు చేపట్టారు. – సాక్షి నెట్‌వర్క్

రేపు 'సాక్షి' ఫోన్ ఇన్



ఎంజీఎం: సీజనల్ వ్యాధులు, డెంగీ, చికున్‌గున్యా ప్రబలుతున్నాయి. జ్వరాలు పెరిగి ప్లేట్‌లెట్స్ తగ్గి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జ్వరం నుంచి కోలుకున్న తర్వాత ఒంటి నొప్పులతో నీరసించి పోతున్నారు. ఈనేపథ్యంలో సీజనల్ వ్యాధులకు వైద్యం, సందేహాలు, వైద్య సలహాల కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళితో 'సాక్షి' ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. వైద్యం, వైద్య సలహాలు, సూచనలు పొందడంతోపాటు సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ :
98499 03030
సమయం : మంగళవారం (ఈనెల 27న)
మధ్యాహ్నం :
2.00 నుంచి
2.45 గంటల వరకు

న్యూస్‌రీల్

ముగిసిన చెస్ పోటీలు



వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యాన హనుమకొండ మాదిరెడ్డికుంట రోజరీ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన అండర్–9 చెస్ పోటీలు ముగిశాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 50 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి పి.కన్నా తెలిపారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు స్కూల్ డైరెక్టర్ అల్లం సునీల్‌రెడ్డి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన బాలికలు, బాలుర విభాగాల్లో నలుగురు చొప్పున క్రీడాకారులు త్వరలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని కన్నా చెప్పారు.

29 నుంచి డిగ్రీ సెకండ్ సెమిస్టర్ ప్రాక్టికల్స్


దేశాయిపేట: బీఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2023–24 విద్యాసంవత్సరం డిగ్రీ అడ్మిషన్ పొందిన సైన్స్ విద్యార్థులకు సెకండ్ సెమిస్టర్ ప్రాక్టికల్స్ ఈనెల 29 నుంచి సెప్టెంబర్ 25 వరకు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు సీకేఎం ప్రభుత్వ కళాశాల స్టడీ సెంటర్ కో–ఆర్డినేటర్ అనిల్‌కుమార్, ప్రిన్సిపాల్ డా. శశిధర్‌రావు సంయుక్త ప్రకటనలో తెలిపారు.

భద్రకాళి సన్నిధిలో అధికారులు



హన్మకొండ కల్చరల్: వరంగల్ శ్రీభద్రకాళి దేవాలయాన్ని ఆదివారం రెండు రాష్ట్రాల ఆదాయపన్ను శాఖ అధికారి ఆనంద రాజేశ్వర్, సంగారెడ్డి జిల్లా ఇరిగేషన్ విభాగం చీఫ్ ఇంజినీర్ కొర్ర ధర్మ సందర్శించారు. అమ్మవారికి పూజలు చేసిన అనంతరం అర్చకులు వారికి శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేశారు. ఏర్పాట్లను ఈఓ శేషుభారతి పర్యవేక్షించారు.

ధార్మిక జీవనంతో జన్మ సుసంపన్నం..



హన్మకొండ కల్చరల్: ధర్మబద్ధంగా ధార్మిక జీవనం గడుపుతూ.. మానవ జన్మను సుసంపన్నం చేసుకోవాలని కామారెడ్డి గుడిమెట్టకు చెందిన వీరశైవ పీఠాధిపతి సద్గురు మహా దేవ స్వామి ఉద్బోధించారు. ఆదివారం ఆయన రుద్రేశ్వరాలయాన్ని సందర్శించగా.. ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. మహాదేవస్వామి రుద్రేశ్వర శివలింగానికి అభిషేకాలు చేశారు. అనంతరం ఉపేంద్రశర్మ.. మహాదేవ స్వామికి ఆలయం పక్షాన పట్టుబట్టలు సమర్పించారు. తర్వాత గుడిబండల్ సమీప రాజరాజేశ్వరస్వామి వారి దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహాదేవ స్వామి ధార్మిక ప్రసంగం చేశారు.

తూకం.. అవినీతి కూపం

లీగల్, మెట్రాలజీ శాఖలో అక్రమార్కులు
- జిల్లా అధికారి ప్రవీణ్‌కుమార్ సస్పెన్షన్
- ఆదాయానికి మించి ఆస్తులున్నాయని తేలడంతో చర్యలు
- పెట్రోల్ బంకులు, వేబ్రిడ్జ్‌ల నుంచి వసూలు చేశారని చర్చ
- మరికొందరి పక్కచూపులు!



వరంగల్ తూనికలు, కొలతల శాఖ కార్యాలయం

సాక్షి, వరంగల్: వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని తూనికలు, కొలతల శాఖలో అవినీతి రాజ్యమేలుతోంది. లైసెన్స్‌దారులను అడ్డం పెట్టుకొని అధికారులు అడ్డగోలుగా అక్రమాలు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వరంగల్ జిల్లా తూనికలు, కొలతల విభాగాధికారిగా ఉండి, హనుమకొండ జిల్లా అదనపు బాధ్యతలు పర్యవేక్షిస్తున్న బి.ప్రవీణ్‌కుమార్, ఆయన భార్య హైదరాబాద్ జిల్లా తూనికలు, కొలతల విభాగాధికారి అనురాధాదేవి అక్రమార్జనకు పాల్పడి ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నట్టు రుజువైంది. దీంతో వారు సస్పెండైన నేపథ్యంలో ఆవిభాగంలోని అవినీతిపై చర్చ జరుగుతోంది. వేబ్రిడ్జ్ వ్యాపారులు, పెట్రోల్‌పంపు డీలర్లు, లైసెన్స్‌డ్ మాన్యుఫ్యాక్చర్డ్ డీలర్లు, పరిశ్రమల యజమానులను వేధించి, భయపెట్టి వసూళ్లు చేసి అక్రమ ఆస్తులు సంపాదించారని విచారణ నివేదికలో తేలింది. దీంతో రెండు జిల్లాల్లోని ఆ విభాగం పనితీరుపై విమర్శలు వస్తున్నాయి.

ఫిర్యాదులొచ్చినా.. తూతూ మంత్రంగానే

పెట్రోల్ బంకుల్లో జరిగే ఇంధనం మోసాలపై ఫిర్యాదులొస్తే జిల్లా తూనికలు, కొలతలశాఖ క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించి చర్యలు తీసుకోవాలి. పెద్దపెద్ద మార్కెట్లు, కూరగాయల మార్కెట్లలో వ్యాపారులు వినియోగిస్తున్న ఎలక్ట్రానిక్ కాంటాలను సంవత్సరానికి ఒకసారి రెన్యువల్ చేసుకునేలా చూడాలి. ఆయా కాంటాల్లో మోసాలు జరుగుతున్నాయా? అని అప్పుడప్పుడు తనిఖీ చేయాలి. మ్యాన్యువల్ కాంటాల మోసాలపై దృష్టి పెట్టాలి. ఇవేమీ పట్టించుకోకుండా మీడియాలో వార్తలు వచ్చినప్పుడు మాత్రమే తూతూమంత్రంగా తనిఖీలు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నారు. అలాగే, పెట్రోల్ బంకుల్లో ఉన్న నాజల్‌ను ఏడాదికోసారి రెన్యువల్ చేసేందుకు ఫీజు రూ.1,720 ఉంది. అయినా అధికంగా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వేబ్రిడ్జ్ కాంటాల రెన్యువల్ చార్జీ రూ.3వేలు ఉంటుంది. అధికారులు మాత్రం రూ.12,000 వరకు వసూలు చేస్తున్నారన్న చర్చ జరుగుతోంది. అదే సమయంలో వేబ్రిడ్జ్ తూకంలో చేసే మోసాలపై ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ (రిటైర్డ్) బి.కరుణాకర్‌రెడ్డి 2020లో ఇచ్చిన ఫిర్యాదుతో అంతర్గత విచారణ జరిపిన ఆ విభాగం.. ప్రవీణ్‌కుమార్‌తోపాటు అతడి భార్య అనురాధాదేవిని శనివారం సస్పెండ్ చేసింది.

ఆదాయానికి మించిన ఆస్తులిలా...

2008లో హైదరాబాద్‌లోని గోపనపల్లిలో 200 గజాల ప్లాట్‌ను జీతం, వ్యవసాయం నుంచి వచ్చే ఆదాయంతో కొనుగోలు చేశామని చెబితే అధికారులు తనిఖీ చేశారు. వారికి వ్యవసాయ భూమి లేదని తేలింది. 2014లో ఆ ప్లాట్‌ను కొనుగోలు చేశారు. అనురాధాదేవి పేరుతో ముబారక్ నగర్‌లో 540 గజాల ప్లాట్ కొనుగోలు చేసిన సమయంలో కంపిటెంట్ అథారిటీ అనుమతి తీసుకోలేదు. 2011లో 1,35,000కు కొనుగోలు చేశామని అనురాధాదేవి చెబితే.. 2012 సంవత్సరంలో 2,70,000కు కొనుగోలు చేశామని ప్రవీణ్‌కుమార్ చెప్పడం గమనార్హం. 2013లో దమ్మాయిగూడలో కొనుగోలు చేసిన 200 చదరపు గజాల ఇంటి విషయంలో, 2014లో నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం చెట్‌పల్లిలోని 225, 226 సర్వే నంబర్లలో ఐదెకరాల వ్యవసాయ భూమిని సాలరీ సేవింగ్స్, బ్యాంకు రుణాల ద్వారా తీసుకున్నామని చెప్పారు. ప్రాపర్టీ స్టేట్‌మెంట్‌లో మాత్రం ఎలాంటి పర్మిషన్ ఆర్డర్స్ లేనట్లు తేలింది. ఇలా వివిధ ఆస్తుల విలువ వీరి జీతభత్యాలను మించి ఎక్కువగా ఉందని తేలింది. ఇదంతా అక్రమంగా వచ్చిన డబ్బుతోనే కొనుగోలు చేశారని విచారణాధికారి నివేదిక ఇవ్వగా వారిని ప్రభుత్వం సస్పెండ్ చేసింది.

బీసీలు సంఘటితం కావాలి



సదస్సులో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బీసీ సంఘాల నాయకులు

- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

కాజీపేట: హక్కుల సాధన, రాజ్యాధికారం కోసం బీసీలు మలిదశ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో సంఘటితం కావాలని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ అన్నారు. బీపీ మండల్ జయంతిని పురస్కరించుకొని కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీలోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం ఆధ్వర్యాన నిర్వహించిన బీసీల సమర శంఖారావం, మేథోమదనం సదస్సులో ఆయన మాట్లాడారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలుచేయకుంటే రానున్న రోజుల్లో వరంగల్‌లో భూకంపం పుట్టిస్తామన్నారు. తాను బతిమిలాడి సీటు తెచ్చుకోలేదు.. బెదిరించి సీటు తెచ్చుకున్నానని స్పష్టం చేశారు. బీపీ మండల్ మనవడు సూరజ్‌యాదవ్ మాట్లాడుతూ.. బీసీలు ఐక్యంగా పోరాడితే రాజ్యాధికారం దక్కడం పెద్ద సమస్యకాదనే విషయాన్ని గుర్తించాలని అన్నారు. ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ బీసీలను విస్మరించి అగ్రకులాలకు పెద్దపీట వేసే పార్టీలకు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సదస్సులో 'సామాజిక న్యాయమే బీసీ నాదం–బీసీ వాదం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. మాజీ డీఆర్డీఏ పీడీ చిరంజీవులు, బీసీ నాయకులు వద్దకొండ వేణుగోపాల్, డాక్టర్ వినయ్‌కుమార్, సాంబారి సమ్మారావు, కన్నెబోయిన రాజయ్యయాదవ్, తేలు సారంగపాణి, ఈగ మల్లేశం, తిరునహరి శేషు తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలకు తరలింపు



వరంగల్ రైల్వే స్టేషన్‌లో నిరాశ్రయులను గుర్తిస్తున్న మెప్మా సిబ్బంది

వరంగల్ అర్బన్: నగరంలోని హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లోని నిరాశ్రయులను శనివారం రాత్రి మెప్మా ప్రతినిధులు గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించారు. గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశం మేరకు హనుమకొండ పలివేల్పుల, వరంగల్ క్రిస్టియన్ కాలనీలోని నిరాశ్రయుల పునరావాస కేంద్రాల్లో చేర్పినట్లు వారు పేర్కొన్నారు. వరంగల్ రైల్వేస్టేషన్, బస్టాండ్, పోస్టాఫీస్ తదితర ప్రాంతాల్లో 18 మంది నిరాశ్రయులను గుర్తించి క్రిస్టియన్ కాలనీలోని పట్టణ నిరాశ్రయుల పునరావాస కేంద్రానికి తరలించినట్లు పేర్కొన్నారు.హనుమకొండ బస్టాండ్, చౌరస్తా తదితర ప్రాంతాల్లో 12 మంది నిరాశ్రయులను గుర్తించి పలివేల్పులలోని పట్టణ నిరాశ్రయుల కేంద్రానికి తరలించినట్లు తెలిపారు. టీపీఆర్‌ఓ రాజేశ్, మెప్మా టీఎంసీ రమేశ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి అక్రమ దందా



మొరం అక్రమ క్వారీ



ఎస్సారెస్పీ భూమిలో తవ్వకాలు

- ఎస్సారెస్పీ భూముల్లో మొరం తవ్వకాలు
- రోజూ వందలాది టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలింపు

హసన్‌పర్తి: ఎస్సారెస్పీ భూములు అక్రమ దందాకు కేంద్రంగా మారాయి. జేసీబీల సహాయంతో అర్ధరాత్రి యథేచ్ఛగా మొరం తోడుతూ.. ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. నీటి పారుదలశాఖ ప్రధాన కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఈ దందా నాలుగేళ్లుగా సాగుతోంది. ఈ అక్రమ తవ్వకాలపై చర్య తీసుకోవాలని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. స్థానికేతరులే అధికారుల అండతో ఈ వ్యాపారం చేస్తున్నట్లు పేర్కొంటున్నారు. ఈ మొరం తవ్వకాలతో ప్రమాదాలు సైతం సంభవిస్తున్నాయి. ఇటీవల మొరం తరలిస్తున్న క్రమంలో టిప్పర్ విద్యుత్ స్తంభానికి ఢీకొట్టడంతో రాత్రి పొద్దు పోయే వరకు కరెంట్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది.

రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు..

ఎస్సారెస్పీ భూముల్లో రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల సమయం వరకు మొత్తం తవ్వకాలు చేపట్టి టిప్పర్లు, ట్రాక్టర్లతో బయటికి తరలిస్తున్నారు.

ఇలా తరలించిన మొరాన్ని ఒక్కో టిప్పర్‌కు రూ.8వేల నుంచి రూ.10వేల వరకు, ట్రాక్టర్ మొరం రూ.1,200 నుంచి రూ.1,500 వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ప్రతీ రోజు వందలాది వాహనాల ద్వారా మొరం తవ్వకాలు జరుగుతుండడంతో ఆ భూములు క్వారీలుగా మారి నీటి పారుదల శాఖకు నష్టం చేకూరనుంది. ఈ భూములను తిరిగి వినియోగంలోకి తీసుకురావాలంటే పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసి ఆ గుంతలను పూడ్చాల్సిందే.

చర్యలు తీసుకుంటాం..

ఎస్సారెస్పీ భూముల నుంచి మొరం అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటాం. ఈవిషయమై ఇప్పటి వరకు తమ దృష్టికి రాలేదు.. ఎలాంటి ఫిర్యాదు కూడా అందలేదు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి బాధ్యులపై చర్య తీసుకుంటాం.
– రాజు, డీఈఈ, నీటి పారుదలశాఖ

ఎల్‌ఆర్‌ఎస్ చకచకా..

'గ్రేటర్'లో 1.01 లక్షల దరఖాస్తులు
- జీడబ్ల్యూఎంసీలో హెల్ప్‌డెస్క్..
- కలెక్టర్, కమిషనర్ల పర్యవేక్షణ
- మార్గదర్శకాల అమలు తప్పనిసరి
- క్షేత్రస్థాయికి ప్రత్యేక బృందాలు..
- 'బల్దియా'లో 12 స్పెషల్ టీమ్‌లు



సాక్షిప్రతినిధి, వరంగల్ : గ్రేటర్ వరంగల్ పరిధిలో ప్రభుత్వ అనుమతి లేని, అనధికార లేఅవుట్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరించే ప్రక్రియ పట్టాలెక్కుతోంది. ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్)కు కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల పచ్చజెండా ఊపిన విషయం తెలిసిందే. ఈ మేరకు రాష్ట్ర పురపాలిక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ మార్గదర్శకాలను ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం 2020లో అప్పటి ప్రభుత్వం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించగా.. ఉమ్మడి జిల్లా నుంచి 1,57,978 మంది తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు రూ.1,000 చొప్పున చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 'గ్రేటర్'నుంచి 1,00,989 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం దరఖాస్తులకు రూ.15.79 కోట్ల ఆదాయం రాగా, 22,105 దరఖాస్తులను పరిష్కరించడం ద్వారా రూ.1,35,58,712 ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. ఆ తర్వాత ఈ ప్రక్రియను నిలిపివేయగా, తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ శ్రీకారం చుట్టడంతో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ పరిధిలో క్షేత్రస్థాయి పరిశీలన కోసం ఇరిగేషన్, మున్సిపల్, రెవెన్యూ, 'కుడా', మైనింగ్ తదితర శాఖల అధికారులు, సిబ్బందితో 12బృందాలు ఏర్పాటుచేశారు. ఈ బృందాల సభ్యులు సర్వేనంబర్ వారీగా సంబంధిత రెవెన్యూ గ్రామం/మున్సిపాలిటీలలో క్షేత్రస్థాయి పరిశీలన చేసి జీపీఎస్ ద్వారా సదరు భూమి కో ఆర్డినేట్స్ పక్కాగా నమోదు చేసే పనిలో ఉన్నారు. అదే విధంగా ఈ భూములు నీటివనరుల బఫర్ జోన్, నాలా, చెరువులు, హెరిటేజ్ బిల్డింగ్, డిఫెన్స్ ల్యాండ్ పరిధిలో ఉన్నాయా? లేదా? అనేది కూడా ఆరా తీస్తున్నారు.

దరఖాస్తుదారులకు ముందుగానే సమాచారం..

ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారిని కలిసి వాస్తవాలను తెలుసుకునేందుకు ముందుగానే సమాచారం ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం టూర్ షెడ్యూల్‌ను ఖరారు చేసుకుని ముందుకు సాగుతున్నారు. గ్రేటర్ వరంగల్‌లో 1,00,989 దరఖాస్తులకు 10,781 ఇదివరకే పరిష్కరించగా, ఇంకా 90,208 దరఖాస్తులున్నాయి. వీటి క్రమబద్ధీకరణపై రెండు జిల్లాల కలెక్టర్‌లు, మున్సిపల్ కమిషనర్, ప్రత్యేక బృందాలు ఫోకస్ పెట్టాయి. కనీసం 3 నెలల్లోపు దరఖాస్తుల పరిశీలన, పరిష్కారం జరగాలని ఇటీవల కలెక్టర్‌లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. ఈ నేపథ్యంలో సత్వర పరిష్కారానికి టీములను ఏర్పాటు చేసిన కలెక్టర్లు ప్రావీణ్య, సత్య శారద, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే రోజువారీగా పర్యవేక్షిస్తున్నారు.

ఇప్పటికైనా డాక్యుమెంట్లు ఇవ్వొచ్చు..




ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన సమయంలో ప్రత్యేక బృందాలు మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలి. దరఖాస్తులకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు జత చేశారా? లేదా? చూడాలి. ఎవరైనా కావాల్సిన డాక్యుమెంట్లు ఆన్‌లైన్‌లో జత చేయకపోతే, దరఖాస్తు నంబర్‌తో వచ్చి హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సమర్పించవచ్చు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
- పి.ప్రావీణ్య, కలెక్టర్, హనుమకొండ

రైతులకు బేడీలు వేయించిన చరిత్ర బీఆర్‌ఎస్‌దే

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

హన్మకొండ(పరకాల): రైతులకు బేడీలు వేయించిన చరిత్ర బీఆర్‌ఎస్ పార్టీదే అని, అలాంటి పార్టీ నాయకులకు రైతుల గురించి మాట్లాడే హక్కులేదని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్‌ను ప్రజలు తిరస్కరించినప్పటికీ.. ఆ పార్టీ నాయకులు మోసపూరిత మాటలతో రైతులను తప్పుదారి పట్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతు రుణమాఫీ విషయంలో బీఆర్ఎస్ చేస్తున్న రైతు ధర్నాలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలే తప్ప రైతులు కనిపించట్లేదని మండిపడ్డారు. మార్కెట్ ఇంటెన్సీ ఫండ్ ఇప్పిస్తామని, రైతులకు బోనస్ చెల్లిస్తామని చెప్పి ఒక్క రుపాయి కూడా ఇచ్చిన పాపాన పోలేదన్నారు. రైతులను మోసపూరిత మాటలతో మోసం చేసిన బీఆర్‌ఎస్ నేడు రైతుల పట్ల మోసలి కన్నీరు కారుస్తోందన్నారు. కానీ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలకు కట్టుబడి రూ.2లక్షల్లోపు ఉన్న రుణాలు మాఫీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతిపక్షాలు చెప్పే మాటలతో ఆందోళన చెందకుండా ఎలాంటి సందేహాలున్నా.. వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని కోరారు. అర్హులైన రైతుందరికి రుణమాఫీ చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి, కొయ్యడ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి

విజయ డెయిరీని ఆధునికీకరించండి

- ఎంపీ కావ్యకు పాడిరైతుల సంఘం వినతి

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ అలంకార్ జంక్షన్ సమీపాన ఉన్న విజయ డెయిరీని ఆధునికీకరించాలని కాకతీయ పాడిరైతుల సంక్షేమ సంఘం సభ్యులు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యను కోరారు. ఆదివారం వారు హనుమకొండలోని ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. పాడిరైతులు మాట్లాడుతూ.. 1969లో విజయ డెయిరీ వరంగల్ జిల్లా యూనిట్ స్థాపించారని, ఇప్పటికీ పాత మిషనరీతోనే నడిపిస్తున్నారని చెప్పారు. దాదాపు 30వేల పైచిలుకు పాడిరైతులు పాలు పోస్తున్నారని, ప్రైవేట్ డెయిరీలకు దీటుగా విజయ డెయిరీని తీర్చిదిద్దితే విక్రయాలు పెరుగుతాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిశారు. దేవేందర్‌రావు, రత్నాకర్‌రావు, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ కావ్యకు వినతి పత్రం ఇస్తున్న పాడిరైతులు

లక్నవరంలో పెద్ద త్రివర్ణ పతాకం ఏర్పాటు చేయాలి

- టూరిజం కార్పొరేషన్ ప్రచారకర్త రామన్న

గోవిందరావుపేట: లక్నవరం సరస్సు దీవుల్లో శాశ్వత అతి పెద్ద త్రివర్ణ పతాకం ఏర్పాటు చేయాలని టూరిజం కార్పొరేషన్ ప్రచారకర్త పులియాల రామన్న అధికారులను కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని బుస్సాపూర్ సమీపంలోని కాకతీయులు నిర్మించిన లక్నవరం సరస్సులోని రెండు దీవుల్లో టూరిజం శాఖ కాటేజీలు నిర్మించి పర్యాటకులకు అందుబాటులో తీసుకొచ్చిందన్నారు. మొదటి దీవిని కలుపుతూ జంట వంతెనలు నిర్మించారని, జంట వంతెనల అందం వర్ణించలేమన్నారు. రాష్ట్ర, దేశ, విదేశీ పర్యాటకులు లక్నవరం అందాలు చూసి ముగ్ధులవుతున్నారన్నారు. ఈ క్రమంలో దేశఖ్యాతి, సరస్సు అందాన్ని మరింత పెంచాలంటే లక్నవరం ఐలాండ్‌లో హుస్సేన్‌సాగర్ తరహాలో అతిపెద్ద జాతీయ జెండాను ఏర్పాటు చేయాలన్నారు. అప్పుడే పర్యాటకులను ఆకట్టుకోవడంతో పాటు దేశ ఖ్యాతిని గౌరవించే వారమవుతామన్నారు. అలాగే, సరస్సు గుట్టపై నుంచి మొదటి ఐలాండ్‌కు రోప్ వే కన్వేయర్ ఏర్పాటు చేస్తే పర్యాటకులకు మరింత ఆనందం కలుగుతుందన్నారు. జిల్లా అధికారులు ఈ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రామన్న కోరారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కంప్యూటర్లు దగ్ధం

- ఎస్‌బీఐ తొర్రూరు శాఖలో ఘటన



దగ్ధమైన ఫర్నిచర్

తొర్రూరు: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)లో రెండు కంప్యూటర్లలో షార్ట్ సర్క్యూట్ సంభవించింది. ఈ ఘటనలో స్వల్ప మంటలు చెలరేగి బ్యాంకు మొత్తం పొగతో కమ్ముకుంది. ఈ ప్రమాదం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో చోటు చేసుకుంది. ఆదివారం బ్యాంకు సెలవు. అయితే సిబ్బంది బ్యాంకుకు కావాల్సిన పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ కంప్యూటర్‌లో పొగలు వచ్చి మరో కంప్యూటర్‌కు వ్యాపించాయి. దీంతో బ్యాంకు నుంచి భారీగా పొగ రావడంతో అప్రమత్తమైన సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వారు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మంటలు ఆర్పేశారు. ఈ మంటల్లో కొన్ని ఫైల్స్, కంప్లైట్స్ బాక్స్, రెండు కంప్యూటర్లు, కొంతమేరకు ఫర్నిచర్ దగ్ధమైందని బ్యాంకు సిబ్బంది తెలిపారు.

కట్టుబట్టలే మిగిలాయి..



దగ్ధమవుతున్న గుడిసె



కాలిబూడిదైన ఇల్లు, వస్తువులు



రోదిస్తున్న తల్లీకూతురు

- కొత్తమల్లూరులో గుడిసె దగ్ధం
- రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం
- మిన్నంటిన బాధితుల రోదనలు

మంగపేట: సాధారణంగా పండుగ రోజు ప్రతి ఇల్లు కళకళలాడుతుంది. కుటుంబీకులు, బంధువుల ఆటాపాటలతో సందడిగా మారుతుంది. కానీ ఓ ఇంట్లో మాత్రం నవ్వుకు బదులు కన్నీళ్లు.. సంతోషానికి బదులు విషాదం నెలకొంది. దీనికి కారణం అగ్ని ప్రమాదం. ఈ ఘటనలో ఇల్లు(గుడిసె) పూర్తిగా దగ్ధమైంది. సర్వం అగ్నికి ఆహుతైంది. కేవలం కట్టుబట్టలే మిగిలాయి. దీంతో బాధితుల రోదనలు మిన్నంటాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కొత్తమల్లూరు గ్రామానికి చెందిన రెబ్బల రాములు, రమాదేవి దంపతులు నిరుపేదలు. కూ లి పని వెళ్లి జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామంలో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. రాములు కూలి పనికి వెళ్లగా రమాదేవి తన కుమార్తె కల్యాణి బోనం ఎత్తుకుని ఆలయానికి వెళ్లారు. కొంత సమయం తరువాత ఇంటి నుంచి మంటలు వస్తున్నాయని ఇరుగు పొరుగువారు కేకలు వేశారు. దీనిపై సమాచారం అందుకున్న మహిళలు, గ్రామస్తులు మంటలు ఆర్పేందుకు ఇంటి దగ్గరకు వెళ్లారు. అప్పటికే మంటలు తీవ్ర కావడంతో ఆర్పేందుకు ఎంత ప్రయత్నించినా ఫలి తం లేకుండా పోయింది. షార్ట్ సర్క్యూట్‌తో ప్రమా దం జరిగి ఉంటుందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలో ఇంట్లోని బీరువాలో దాచి పెట్టిన రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, సుమారు 25 తులాల వెండి పట్టీలు, రూ. 90 వేల వరకు నగదుతో పాటు టీవీ, మంచాలు, బియ్యం, బట్టలు, గృహోపకరణాలు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. దీంతో సుమారు రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితురాలు రాములు, రామాదేవి దంపతులు కన్నీరుమున్నీరయ్యారు. తాము ఇప్పుడెలా బతకాలని గుండెలు బాదుకుంటూ తల్లీకూతుళ్లు రోదించిన తీరు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. తాను డిగ్రీలో చేరందుకు సిద్ధం చేసుకున్న టెన్త్ మెమో, ఇంటర్ సెకండియర్ సర్టిఫికెట్, రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు అన్ని గద్దమయ్యాయని, ఇప్పుడు తన పరిస్థితి ఏమిటని కుమార్తె రోదించిన తీరు అందరిని కలిచి వేసింది. కాగా, ఈ అగ్నిప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా? లేదా మరే ఇతర కారణం వల్ల జరిగిందా అనే విషయం తెలియాల్సి ఉంది.

రూ. 5వేల ఆర్థిక సాయం..

కూలీ పనులే ఆధారంగా జీవనం సాగిస్తూ అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలే మిగిలిని నిరుపేద బాధిత కుటుంబానికి ఎస్సై టీవీఆర్ సూరి రూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు. అగ్నిప్రమాద విషయం తెలుసుకుని ఘటనా స్థలిని పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని ప్రమాదం ఎలా జరిగిందనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పరంగా కుటుంబానికి న్యాయం జరిగే విధంగా చూస్తామన్నారు.

సమాజ చైతన్యంలో ముందుండాలి



కిరణ్మయి రచించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సురభివాణి, గ్రంథాలయ చైర్మన్ ఎండి. రియాజ్

- ఎమ్మెల్సీ సురభివాణి

విద్యారణ్యపురి : కవులు, రచయితలు సమాజాన్ని చైతన్యపరచడంలో ముందుండాలని ఎమ్మెల్సీ సురభివాణి అన్నారు. భాషోపాధ్యాయురాలు రావుల కిరణ్మయి రచించిన బొ్ద్రవుతు కథా సంపుటిని, పీవీ నర్సింహారావు ఉయ్యాల పాటపుస్తకాన్ని చక్రవర్తుల రాధాకృష్ణ సాహితీవేదిక ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ వడ్డేపల్లిరోడ్డులోని పీఆర్ రెడ్డి భవన్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సురభివాణి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కిరణ్మయి ఉయ్యాల పాట రూపంలో పీవీ చరిత్ర రాయడం గొప్ప ప్రయోగమన్నారు. కిరణ్మయి ఆలోచన విధానాన్ని ఈ సందర్భంగా అభినందించారు. రాష్ట్ర గ్రంథాలయం సంస్థ చైర్మన్ ఎండి. రియాజ్ పీవీ నర్సింహారావు అనుసరించిన విధానాలు, సేవలను కొనియాడారు. పలువురు వక్తలు మాట్లాడుతూ బొ్ద్రవుతు కథల్లో రచయిత రాసిన అనేక సామెతలను ప్రస్తావిస్తూ ఆమెకు పల్లెజీవితంపై తెలంగాణ భాష, యాసపై పట్టును కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖ కథా రచయిత బీవీఎన్ స్వామి బొ్ద్రవుతు కథా సంపుటిని సమీక్షించారు. కవయిత్రి, హిందీ స్కూల్ అసిస్టెంట్ మెరుగు అనురాధ పీవీ నర్సింహారావు ఉయ్యాల పాట పుస్తకాన్ని సమీక్షించారు. సమావేశానికి చక్రవర్తుల సాహితీవేదిక అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్ అధ్యక్షత వహించగా ప్రముఖ నవలా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్, జానపద విజ్ఞానవేత్త, తెలుగు యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య భక్తవత్సలరెడ్డి, కరీంనగర్‌లోని పీవీ సాహిత్యపీఠం అధ్యక్షుడు కల్వకోట వెంకట సంతోశ్‌బాబు, కవి, రచయిత నంది పురస్కార గ్రహీత రావుల పుల్లాచారి, నిర్వాహకులు తెలుగు స్కూల్ అసిస్టెంట్ డాక్టర్ అడ్లూరి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కేయూలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కేయూలో లైబ్రరీ వద్ద పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. యూనివర్సిటీలోని కేంద్ర గ్రంథాలయం, ఇతర ప్రాంతాల్లో టాయ్‌లెట్స్, వాష్‌రూమ్‌లు, రెస్ట్ రూమ్‌ల ఏర్పాటుకు రిజిస్ట్రార్ మల్లారెడ్డి.. వర్సిటీ అభివృద్ధి అధికారి ఎస్. వాసుదేవరెడ్డితో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. యూనివర్సిటీ క్యాంపస్‌లో మొత్తం 10 టాయ్‌లెట్స్ బ్లాక్‌లు ఒక్కొక్క బ్లాక్ రూ 10.50 లక్షల చొప్పున వ్యయంతో నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగంలో యూనివర్సిటీ ఇంజనీర్ పొన్నాల రామయ్య, లైబ్రరీ అసిస్టెంట్లు తేజావత్ జావేర్, ఐజాక్ ప్రభాకర్, డాక్టర్ రవిశంకర్, బిల్డింగ్ డివిజన్ బాధ్యులు తేజావత్ జావేర్, ఇజాక్ సుధాకర్, రవిశంకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అన్నిపనులకు ఒకే చోట లైబ్రరీ వద్ద శంకుస్థాపన చేశారు.

ఆరు టన్నుల నల్లబెల్లం పట్టివేత



నల్లబెల్లం లోడ్‌తో పట్టుకున్న వ్యాన్‌ను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

గూడూరు: మండలంలోని దుబ్బగూడెం, చిల్ల గండితండాల్లో నిర్వహించిన దాడుల్లో ఆరు టన్నుల నల్లబెల్లంతో పాటు 2 వందల కిలోల పటిక, 60 లీటర్ల గుడుంబా పట్టుకుని ఓ వ్యాన్, ఆటో, రెండు బైక్‌లు సీజ్ చేసి పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎస్. భిక్షపతి ఆదివారం తెలిపారు. ఈ రెండు గ్రామాల్లో దాడులు నిర్వహించి కొమ్ముగూడేనికి భూక్య బావ్‌సింగ్, లైన్‌తండాకు చెందిన బానోతు దేవ్, అజ్మీరా సూర్య, దుబ్బగూడేనికి చెందిన అజ్మీరా చిన్న, లక్ష్మణ్‌తండాకు చెందిన లావుడ్య బాలు, చిల్లగండితండాకు చెందిన గుగులోతు జ్యోతి, ఏపీలోని కడప జిల్లాకు చెందిన మీసాల వెంకటరమణ, డెరంగుల శివకుమార్‌పై కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై రాజేశ్వరి, హెడ్‌కానిస్టేబుల్ బుచ్చయ్య, కానిస్టేబుళ్లు సుధాకర్, నరేశ్, వెంకన్న, బాలకృష్ణ, దేవేందర్, యుగేందర్, గద్దర్, సాయిరామ్, మనోజ్, మల్లికార్జున్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి దేహశుద్ధి?

వరంగల్: ఏనుమాముల ప్రాంతానికి చెందిన ఓ కాంగ్రెస్ నాయకుడికి దేహశుద్ధి జరిగిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. కాశిబుగ్గకు చెందిన ఒక సీనియర్ ప్రజాప్రతినిధి సామాజిక వర్గానికి చెందిన ముఖ్య అనుచరుడు భూ క్రయవిక్రయాలు చేస్తుంటాడు.ఈ భూముల్లో ఎక్కువ వివాదాస్పదం, ప్రభుత్వ ఆక్రమిత స్థలాలు ఉండడంతో సదరు కాంగ్రెస్ నాయకుడు జోక్యం చేసుకోవడంతో ఇరువురు (ప్రజాప్రతినిధి, ముఖ్య అనుచరుడు) ఒక ఒప్పందానికి వచ్చి అమ్మకాలు చేస్తుంటారు. ఏనుమాముల, కాశిబుగ్గ ప్రాంతాల్లోని ఇందిరమ్మ కాలనీ, ఎస్ఆర్‌నగర్, బాలాజీనగర్, చాకలి ఐలమ్మ కాలనీల్లో ఈ దందా సాగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివాదాస్పదమైన భూముల విక్రయాల్లో జోక్యం చేసుకోవడం వల్ల పలువురు బాధితుల ఫిర్యాదుల మేరకు ముఖ్యనేత 14 డివిజన్‌లో పార్టీ కార్యక్రమాలు అప్పగించకుండా దూరంగా ఉంచినట్లు తెలుస్తోంది. ఈ భూముల విక్రయాల సందర్భంగా ఆర్థిక పరమైన లావాదేవిల్లో వచ్చిన తేడాలతో ఇరువురు (ప్రజాప్రతినిధి, ముఖ్య అనుచరుడు) రెండు రోజులు క్రితం ఓ బార్ షాపులో గొడవపడినట్లు తెలిసింది. ఒకరిపై మరొకరు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసారనే ప్రచారం జరిగింది. ఈవిషయంపై ఏనుమాముల పోలీసులను వివరణ కోరగా బార్ షాపు వద్ద స్వల్పంగా ఇరువురి మధ్య వాగ్వాదం జరిగినట్లు తెలిసిందని, ఎలాంటి కేసు నమోదు కాలేదని తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- రూ.12లక్షల నగదు, 11 తులాల బంగారం అపహరణ
- నర్సంపేటలో ఘటన



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి

నర్సంపేట రూరల్ : తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన నర్సంపేట పట్టణంలో జరిగింది. నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి కథనం ప్రకారం.. పట్టణంలోని వరంగల్ రోడ్డు వివేకానంద కాలనీకి చెందిన మేదవరపు కమలాకర్‌రావు నల్లబెల్లి మండలంలోని రుద్రగూడెంలో ఓ ప్రైవేట్ పాఠశాల నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం పని నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లాడు. ఆదివారం తెలవారుజామున ఇంటికి వచ్చి చూడగా వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో అనుమానం వచ్చి బీరువా చూడగా అందులోని రూ. 12 లక్షల నగదు, 11 తులాల బంగారం కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. క్లూస్ టీం, జాగీలాలతో ఇల్లు, చుట్టుపక్కల పరిసరాలను పరిశీలించారు. అనంతరం బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గీత దాటితే.. వాత తప్పదు!

రిజిస్ట్రేషన్ కార్యాలయాలపై ఏసీబీ నజర్

- ఇప్పటికే రెడ్‌హ్యాండెడ్‌గాదొరికిన ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు
- ప్రక్షాళనకు జీరో ట్రాన్స్‌ఫర్లు
- డాక్యుమెంట్ రైటర్లతో ములాఖత్

కాజీపేట అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఏసీబీ నజర్ కొనసాగుతున్నట్లు సమాచారం. ఇటీవలి ఏసీబీ దాడితో ఒక్కసారిగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వణుకు మొదలైంది. అయినప్పటికీ కొంతమంది సబ్ రిజిస్ట్రార్ల తీరు మారలేదని ఏసీబీ కొరఢా ఝుళిపించేందుకు నిఘా వేసినట్లు సమాచారం.

ప్రక్షాళనకు జీరో ట్రాన్స్‌ఫర్స్

రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో ప్రక్షాళన చేపట్టేందుకు ప్రతీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పూర్తి స్థాయి అటెండర్ నుంచి సబ్ రిజిస్ట్రార్ వరకు బదిలీలు చేపట్టేందుకు జీరో ట్రాన్స్‌ఫర్స్‌కు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జూలై 20వ తేదీన అటెండర్ స్థాయి నుంచి జూనియర్, సీనియర్ అసిస్టెంట్ల బదిలీలు, జూలై 31న సబ్ రిజిస్ట్రార్లతో పాటు రిజిస్ట్రార్‌ల బదిలీలు చేపట్టింది.

డాక్యుమెంట్ రైటర్లతో ములాఖత్

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అటెండర్ స్థాయి నుంచి జిల్లా రిజిస్ట్రార్ వరకు బదిలీలు చేపట్టి వేరే జిల్లా నుంచి పూర్తి స్థాయిలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు బదిలీ చేపట్టారు. జీరో ట్రాన్స్‌ఫర్స్‌లో భాగంగా అటెండర్, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లతో పాటు సబ్ రిజిస్ట్రార్లు కొత్తవారే కాగా డాక్యుమెంట్ రైటర్లు మాత్రం ఎక్కడి వారు అక్కడే పాతుకుపోయి ఉన్నారు. దీంతో సబ్ రిజిస్ట్రార్ మారితేనేం మేము ఉన్నాం. మీకు అన్ని విధాలా సహకరిస్తాం' అంటూ ఇటీవల సబ్ రిజిస్ట్రార్లు డాక్యుమెంట్ రైటర్లతో ములాఖత్ ఏర్పాటు చేసుకున్న సందర్భంలో హామీ ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఇలాగైతే మార్పు ఎలా సాధ్యం అవుతుందని, తమకు ఎలా న్యాయం జరుగుతుంది అని సామాన్యులు వాపోతున్నారు.

ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లపై ఏసీబీ దాడి

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలో ఇప్పటికే ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లపై ఏసీబీ దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. మార్చిలో మహబూబాబాద్‌లో తస్లీమా, జూలైలో పరకాల సబ్ రిజిస్ట్రార్ సునీత ఏసీబీ దాడిలో రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయి జైలుకు వెళ్లారు. గీత దాటితే ఏసీబీ వాత తప్పదు అనే విషయాన్ని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో హాట్‌టాపిక్‌గా మారిపోయింది.

విష జ్వరంతో చిన్నారి మృతి



చిన్నారి మృతదేహం

కొత్తగూడ: విష జ్వరంతో ఓ చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని వేలుబెల్లి శివారు హనుమాన్‌తండాలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. తండాకు చెందిన భుక్యా రాజేందర్, సంధ్య దంపతుల కుమార్తె రూప(18 నెలలు)కు రెండు రోజుల క్రితం జ్వరం వచ్చింది. దీంతో నర్సంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అయినా తగ్గకపోవడంతో ఆదివారం మళ్లీ తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు.. చిన్నారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, వెంటనే ఎంజీఎం తరలించాలని సూచించారు. దీంతో ఎంజీఎం తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. రూప మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

పాయబాటలులో వ్యక్తి..



నారాయణ(ఫైల్)

వాజేడు: మండలంలోని పాయబాటలు గ్రామానికి చెందిన అల్లి నారాయణ(43) జ్వరంతో బాధపడుతూ మృతి చెందాడు. నారాయణకు ఐదు రోజుల క్రితం జ్వరం వచ్చింది. ఏటూరు నాగారంలో వైద్యం చేయించినా తగ్గకపోవడంతో వరంగల్‌లోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రైలు నుంచి జారిపడి మహిళ..

కాశిబుగ్గ : గుర్తుతెలియని రైలు నుంచి జారి పడి ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్సై మొయినొద్దీన్ కథనం ప్రకారం.. హనుమకొండ లష్కర్ బజార్‌కు చెందిన సాధియా(42) నాలుగు సంవత్సరాల నుంచి సికింద్రాబాద్ లాలాగూడలో కుమారుడు సల్మాన్, కూమార్తె సల్మాతో కలిసి ఉంటుంది. ఈ క్రమంలో శనివారం గుర్తుతెలియని రైలులో వస్తుండగా జారి పడి మృతి చెందింది. ఈ ఘటనపై డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతురాలి తల్లి రహమతున్నీషా బేగంకు అప్పగించామని ఎస్సై మొయినొద్దీన్ ఆదివారం తెలిపారు.

వాహనం ఢీకొని గుర్తుతెలియని యువకుడు..




గుర్తుతెలియని యువకుడి మృతదేహం

దామెర: గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన దామెర పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై అశోక్ కథనం ప్రకారం.. మండల కేంద్రం సమీపంలోని శ్రీ హర్ష పాఠశాల సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొనగా ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులకు సమాచారం అందడంతో ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. మృతుడు 35 సంవత్సరాల వయసు ఉండి చామన్ ఛాయ కలిగి ఉన్నాడు. 5 అడుగుల 6 అంగుళాలు సన్నగా కోల ముహంతో ఉన్నాడు. గడ్డంతో నలుపు రంగు ప్యాంటు, నలుపు రంగు టీ షర్టు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసినవారు 8712685228, 8712685020, 8712685226 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్సై పేర్కొన్నారు.

ఫేక్ నంబర్ ప్లేట్‌తో ఇసుక తరలింపు

- లారీని సీజ్ చేసిన పోలీసులు



ఫేక్ నంబర్ ప్లేట్‌తో ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్న పోలీసులు

వెంకటాపురం(కె): మండలంలోని ఒంటిచింతలగూడెం ఇసుక ర్యాంప్ నుంచి ఫేక్ నంబర్ ప్లేట్ అమర్చుకుని ఇసుక తరలిస్తున్న లారీని పోలీసులు ఆదివారం సీజ్ చేశారు. ఎస్సై కొప్పుల తిరుపతిరావు కథనం ప్రకారం.. శనివారం సాయంత్రం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల చెందిన నేనావత్ సురేశ్, పట్లావత్ శ్రావణ్ ఒంటి చింతలగూడెం ఇసుక ర్యాంప్ నుంచి ఫేక్ నంబర్ ప్లేట్‌తో హైదరాబాద్‌కు ఇసుక తరలిస్తున్నారు. దీనిపై టీఎస్ఎండీసీ అధికారుల సమాచారం మేరకు మండల కేంద్రంలోని శివాలయం వద్ద వాహన తనిఖీల్లో లారీని పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. పట్టుకున్న లారీని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతిరావు పేర్కొన్నారు.

కొత్తకొండ ఆలయ ప్రధానార్చకుడికి సన్మానం



ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయ ప్రధానార్చకుడు మొగిలి పాలెం రాంబాబుకు జాతీయ పురస్కారం లభించింది. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ పురస్కారాల అవార్డు కార్యక్రమంలో ఆయనకు జాతీయ పురస్కార స్వర్ణ కంకణ అవార్డు అందజేశారు. ఈసందర్భంగా రాంబాబు–లలితాదేవి దంపతులను శాలువా కప్పి సత్కరించారు. రాంబాబును అర్చక బృందం, ఆలయ ఈఓ కిషన్‌రావు అభినందనలు తెలిపారు.

తీజ్ వేడుకల్లో ఎంపీ కావ్య సందడి



బంజారా మహిళలతో కలిసి సంప్రదాయ నృత్యం చేస్తున్న వరంగల్ ఎంపీ కడియం కావ్య

హన్మకొండ: హనుమకొండ అశోక కాలనీలోని గిరిజన భవన్‌లో గోర్ బంజారా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తీజ్ ఉత్సవాల్లో ఆదివారం ఎంపీ కడియం కావ్య సందడి చేశారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం బంజారా మహిళలతో కలిసి నృత్యం చేశారు.

సాకులు చెప్పకుండా రుణమాఫీ చేయాలి

కమ్యూనిస్టులు కావాలని ప్రజల కోరిక

- పార్టీ మారితే క్రిమినల్ యాక్షన్ ఉండాలి
- బీఆర్ఎస్ మనుగడకోసం పోరాటం
- విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు

న్యూశాయంపేట : రైతులకు ఇచ్చిన హామీ మేరకు సాకులు చెప్పకుండా రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. హనుమకొండలోని హరితకాకతీయలో మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర సమితి నిర్మాణ సమావేశాలు శనివారం ముగిశాయి. ఆదివారం హనుమకొండలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాసమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టులు ఉండాలనే భావన ప్రజల్లో ఉందన్నారు. చట్టసభల్లో కమ్యూనిస్టులు ఉంటే ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తారని వరంగల్ పోరుగడ్డలో మూడు రోజుల పాటు జరిగిన పార్టీ నిర్మాణ సమావేశాల్లో దేశ, రాష్ట్ర పరిస్థితులు చర్చకు వచ్చాయన్నారు. ప్రజల్లో పాలక పక్షాలపై ఉన్న అసంతృప్తిని గుర్తించి కమ్యూనిస్టు పార్టీగా పోరాట పంథాను ఏ విధంగా తీసుకెళ్లాలనే చర్చ జరిగిందన్నారు. ఇటీవల ఒక పార్టీలో గెలిచిన వారు మరో పార్టీలో చేరి ప్రజా తీర్పును అపహాస్యం చేస్తున్నారన్నారు. పార్టీ మారితే పదవి ఊడే విధంగా క్రిమినల్ యాక్షన్ ఉండాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ఏర్పాటైన 'హైడ్రా'కు మద్దతు తెలుపుతున్నామని, పేదల జోలికి వెళ్లకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ మనుగడకోసం పోరాటం చేస్తూ ఇబ్బందులు పడుతోందని, ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారన్నారు. సెప్టెంబర్ 2న దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా అధికధరలపై ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు 'తెలంగాణ సాయుధ పోరాటం–కమ్యూనిస్టుల పాత్ర' అనే అంశంపై వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. కాగా, నిర్మాణ సమితి సమావేశాల్లో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా వరంగల్‌కు చెందిన తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, మేడ్చల్‌కు జిల్లాకు చెందిన బాలమల్లేశ్‌ను ఎన్నుకున్నారు.



రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికైన శ్రీనివాస్‌రావు